
మల్లాది వెంకట కృష్ణమూర్తి



'నిన్నూ, జయనీ చూసాను ఇందాక అలంకార్ హోటల్‌లో' చెప్పాను సుబ్బారావుకి.

'చూసి వుండవచ్చు. సినిమానుంచి హోటల్‌కు వెళ్లాము ఇద్దరం. దాదాపు అరగంటపైనే వున్నాము హోటల్‌లో' అన్నాడు సుబ్బారావు నిర్లక్ష్యంగా.

'పెళ్ళి చేసుకోకుండా ఈ అడ్డదారులెందుకు ?' అడిగాను సుబ్బారావుని.

'డామిట్! ఆ ప్రశ్నకి సమాధానం, మనిషికి కోరికపెట్టిన దేముణ్ణి అడుగు. లేదా, ఇంతవరకూ నా పెళ్ళి గురించి ఆలోచించని మా అమ్మా, నాన్నలను అడుగు' అన్నాడు సుబ్బారావు కోపంగా.

'మధ్యలో వాళ్లేం చేసారు?'

'అన్నయ్యకి పెళ్లి కాలేదు ఇంకా. అక్కయ్యకి ఇప్పట్లో అయ్యేటట్లు లేదు. కట్నం ఇచ్చేందుకు ఎవరిదగ్గరా డబ్బు లేదు. అక్కయ్య పెళ్లి, అన్నయ్య పెళ్లి అయి నా వంతు వచ్చేసరికి ముసలాడిని అయిపోతాను. అప్పటిదాకా నా కోరికలు చంపుకొని సన్యాసిలా బ్రతకడానికి నేను గాంధిమహాత్ముణ్ణి కాదు. బుద్ధుణ్ణి అంతకంటె కాదు.'

'అందుకని అడ్డదారులు తొక్కుతావా?'

'బుద్ధిమంతుడిలాగా మాట్లాడుతున్నావే ?'

'కాదని నిరూపించగలవా ?' అన్నాను తీవ్రంగా.

'జయ నా గర్ల్ ఫ్రెండ్. ఆ అమ్మాయికి లేని బాధ నాకెందుకు? జయని నువ్వు

పెళ్ళి చేసుకోబోవటం లేదుగా?'

'నువ్వు నీ కాబోయే పెళ్ళానికి అన్యాయం చేస్తున్నావు. జయ తన కాబోయే భర్తకి అన్యాయం చేస్తోంది.'

'మేం చేసేది అన్యాయం కానీ, అడ్డదారులు కానీ అని అనుకోను నేను. జయకి డబ్బు కావాలి. నాకు సుఖం కావాలి. మేం ఇద్దరం అవి లేకపోతే బతకడం కష్టం.'

'మీ అక్కయ్య నీకన్నా వయసు ఎక్కువ, కాబట్టి కోరికలు ఎక్కువగా వుండలి. నీలాంటి మనిషే కాబట్టి. మీ అక్కయ్య కోరికలు చంపుకుని వుండటంలేదా ?' అడిగాను.

మింగేసేటట్లు చూసాడు సుబ్బారావు నా వంక.

'అక్కయ్య విషయం వేరు. ఆడవాళ్ళకి అవకాశాలు చాలా తక్కువ. ఎవరికయినా తెలుస్తే పెళ్ళి కాదని భయం. ఇంకా ఎన్నో అడ్డంకులు. స్వతంత్రం, స్వేచ్ఛ వుండవు మనలాగా.'

'అంటే నీలాగా బయటవుంటే, అడ్డదారులు తొక్కుతుందనేగా నువ్వనేది?'

'షటప్. అలా అని అనలేదు నేను' అరిచాడు సుబ్బారావు కోపంగా.

'నీవు చేసే పని నాకేం నచ్చలేదు.'

'నీకు నచ్చిందా లేదా అని నిన్నడగలేదు నేను. జయ సంగతి నీకు తెలీదు. చాలా అందంగా వుంటుంది అన్నిటికన్నా ముఖ్యం వ్యభిచారి కాదు. ఫేమిలీ గర్ల్. వ్యభిచారితో వున్నట్లుండదు. భార్యతోనో, ఫేమిలీ గర్ల్‌తోనో వున్నట్లుంటుంది. నేను చూసిన చాలామంది వ్యభిచారుల్లో వున్న నటనలు, టక్కులు ఏమీ లేవు జయ దగ్గర.'

'జయని పెళ్ళి చేసుకోకూడదూ ?' అడిగాను.

పక పకా నవ్వాడు సుబ్బారావు.

'పిచ్చివాణ్ణనుకుంటున్నావా ?'

'ఏం ?'

'దేనికి జయని పెళ్ళి చేసుకోవడం ? పెళ్ళయితే దొరికేది పెళ్ళి కాకుండానే దొరుకుతుంది కదా?'

'అంటే జయ కేవలం నీ దృష్టిలో ఆటవస్తువనేగదా నీ వుద్దేశం ?'

'చిత్తం. ఈ సంగతి జయకి కూడా తెలుసని నాకు తెలుసు. మధ్య నీ కంఠశోష ఎందుకు ?'

'పెళ్ళి చేసుకునేది కేవలం కామం తీర్చుకోడానికే. అది తీరుతున్నంతవరకూ పెళ్ళి చేసుకోకపోయినా ఫర్వాలేదు. అర్థమైనా?'

'పెళ్ళి చేసుకోవడానికి మూడు కారణాలు. నెంబర్ వన్: కట్నం. జయని చేసుకుంటే రాదు. నెంబర్ టు: నువ్వు చెప్పిన కారణం. పెళ్ళి కాకపోయినా జయ దక్కుతుందిగా. నెంబర్ త్రీ: వంట చేసి పెట్టడానికి. జయ వంట జయ అంత అందంగా వుండదు.'

'పెళ్ళి వాంఛ తీర్చుకోడానికేనా ? పెళ్ళిలో పవిత్రత ఇంకేం తెలీదా నీకు.'

'సారీ. తర్వాత చెప్పు వింటాను. లేకపోతే పెళ్ళి కాగానే పెద్దలు కార్యం యెందుకు ఏర్పాటు చేస్తారు?'

మాట్లాడలేదు నేను.

'పెళ్ళి చేసుకుంటే ఇప్పుడు జయకి ఇస్తున్న డబ్బు మిగులుతుంది.'

'నువ్వు చదివిన బి. ఏ. దండగ.' అన్నాను.

'కావచ్చు. కాని బి. ఏ. కి దీనికీ ఏ మాత్రం సంబంధం లేదు. బి.ఏ.లో చెప్పే సబ్జక్టు వేరు. జయకి డబ్బు పిచ్చి చాలా ఎక్కువ. తనకి వచ్చే జీతంతో సరిపెట్టుకోదు. అందుకనే తేలికగా లొంగిపోయింది నాకు. ఈ రెండున్నర సంవత్సరాల్లో చాలానే ఇచ్చాను జయకి.'

మర్నాడు సాయంత్రం ఆఫీసు నుంచి హేవ్‌మోర్‌కి వెళ్ళాను. ఇంక్రిమెంట్ వచ్చిందని చెప్పాడు ఆఫీసర్ నాకు. ఒక మూల బల్ల ముందు కూర్చుని వున్నారు సుబ్బారావు, జయ. నన్ను చూసి దగ్గరకి రమ్మని పిలిచాడు సుబ్బారావు. వెళ్ళి ముందు ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాను.

వనీలా తింటున్న జయ నా వంక చూసి తియ్యగా నవ్వింది. చెవులకి లోలాకులు వేలాడుతున్నాయి. బంగారంవి కావు. ప్లాస్టిక్‌తో చేసినవి. జయ చాలా అందంగా వున్నది అనుకున్నాను మనస్సులోనే.

'నిన్న మీరు మీ స్నేహితుడిమీద ఎగిరారట' అన్నది జయ నవ్వి.

'లేదే.' అన్నాను.

'అబద్ధం ఆడకురోయ్. అడ్డ దారులు తొక్కుతున్నానని...'

సుబ్బారావుని వాక్యం పూర్తి చేయనివ్వలేదు నేను.

'నేను చెప్పిన సంగతు లన్నీ చెప్పాడా మీకు?' అడిగాను జయని.

తల ఊపింది నవ్వుతూనే.

'స్నేహితుడిగా నా బాధ్యత అనుకుంటాను అలా చెప్పటం. ఇది మంచి దారి కావచ్చు. చెడ్డ దారి కావచ్చు. కాని ఎవరూ అంగీకరించని దారి. ఏమంటారు?' అడిగాను జయవంక చూస్తూ.

జయ బుగ్గలు ఎర్రబడ్డాయి. మాట్లాడలేదు.

'మీకు ఎందుకు అంత డబ్బు పిచ్చి ? రేడియోలో నాటకాల్లో కూడా డబ్బు సంపాదిస్తున్నా రనుకుంటాను. నెలాఖరున జీతం వస్తుంది, మీకు సరిపడా. సుబ్బారావు ద్వారా నెలకి వంద దాకా వస్తాయి'

జయ నాకు క్రొత్తకాదు. సంవత్సరం న్నర క్రితం పరిచయం చేసాడు సుబ్బారావు నాకు. తర్వాత నాలుగయిదుసార్లు మేం ముగ్గురం కలిసి సినిమాలకి, ఒకసారి జూలాజికల్ పార్క్‌కి వెళ్ళాము కూడా.

'నాకేం డబ్బు పిచ్చిలేదు. నిజానికి నాకు వచ్చే డబ్బు చాలదు అంటే నమ్మరు ఎవరూ. నలుగురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు, పక్షవాతంతో మంచం మీద వున్న పెద్దన్నయ్య. వీళ్ళందరిని పోషించాలి. అప్పుడే ఇద్దరు చెల్లెళ్ళు పెళ్ళికి సిద్ధంగా వున్నారు.'

'మీ పెళ్ళి తరవాత కదా వాళ్ళది.'

జయ ఏం మాట్లాడలేదు. ఐస్‌క్రీమ్ వంక చూస్తూండి పోయింది. ఆలోచిస్తోందనుకున్నాను.

'వాళ్ళంతా ఎక్కడున్నారు?' అడిగాను రెండునిముషాల తర్వాత.

'మావూళ్ళో' చెప్పింది నెమ్మదిగా.

'నెలనెలా పంపుతారన్నమాట. బేంక్‌లో వేస్తున్నారనుకున్నాను' అన్నాను.

'కొంత పంపుతాను కొంత దాస్తాను. కాని వాళ్ళెవ్వరికి ఇంత డబ్బు ఎలా వస్తోందో తెలియదు నిజం. రేడియో నాటకాల ద్వారానే అనుకుంటున్నారు' అన్నది జయ.

'వాళ్ళకి ఎప్పుడయినా తెలిస్తే ?' అడిగాను

'తెలియ నివ్వను ఛస్తే;'

## కాపేశాడం

'తెలిసిందనుకుంటాను. అన్నాడు?'

'ఏం చేయాలో ముందరే ఆలోచించి పెట్టుకున్నాను.'

'ఏం చేస్తారు?'

జయ సమాధానం చెప్పలేదు. మళ్ళీ మౌనంగా వుండిపోయింది, వనిలా ఐస్‌క్రీమ్ వంక చూస్తూ.

రాత్రి త్వరగా వచ్చాడు సుబ్బారావు.

'స్టుపిడ్. మేనర్స్ తెలియదు నీకు. నేను చెప్పిందంతా వెళ్ళి జయ ముందు వాగేసావు. ఆ అమ్మాయి నన్నుగురించి ఏం అనుకుంటుంది?' అన్నాను కోపంగా, సుబ్బారావు వంక చూస్తూ.

'జయ సంగతి నీకు తెలీదు. ఏమీ అనుకోదు. చెప్పిందంతా విని నవ్వింది. జయ అంటే నాకెంతో ఇష్టం. ఎంతో తెలివైనది చైనా రాజకీయాలనుంచి చీపురుకట్ట వరకూ ఏ విషయం మీదయినా చాలా బాగా మాట్లాడగలదు. అన్నీ తెలుసు. ఏమన్నదో తెలుసా? నిన్ను పిల్లను వెదికమంది నాకు. ఇంక ప్రారంభించు' అని పగలబడి నవ్వాడు.

'డోంట్ బి సిల్లీ. నీకు వుండాలి ఉత్సాహం, నీ భవిష్యత్తు మీద.'

'థాంక్స్. ఆలోచిస్తాను' అన్నాడు.

'ఆలోచించడం కాదు చేయాల్సింది. ఏది మంచిదో అది వెంటనే చేసెయ్యి'

'లైన్ క్లియర్ కానీ మా అక్కయ్యకి ఏవో సంబంధాలు చూస్తున్నారుట. అమ్మ రాసింది. ఏదయినా ఒకటి కుదురుతే బాగుణ్ను తొందరగా.'

'మీ అన్నయ్యకి అవుతేగాని అక్కయ్యకి కాదుగా?'

'ఇద్దరికీ ఒకేసారి కలిపి చేసేస్తారు. అన్నయ్యకి వచ్చే కట్నం అక్కయ్య పెళ్ళికి అయిపోతుంది. అందుకనే ఇన్నాళ్ళు ఆపారు అన్నయ్య పెళ్ళి'

'నీ కట్నానికి ఇంకెవరి పెళ్ళికయినా ముడిపడి వుందా?' అడిగాను.

'అహా, చెల్లెలు వుందిగదా.' నవ్వాడు.

'నేను మాత్రం ఫస్ట్ వర్కింగ్ గర్ల్స్‌ను చేసుకోను.' అన్నాను సుబ్బారావుతో.

'ఛ. వర్కింగ్ గర్ల్స్ అంతా జయ లాంటివాళ్ళేనా నీ ఉద్దేశం? వర్కింగ్ గర్ల్స్‌లో ఎంతమంది మంచివాళ్ళు లేరు,' అన్నాడు.

మూడు నెలల తరువాత ఒక రోజు చెప్పాడు సుబ్బారావు, వాళ్ళక్కయ్య పెళ్ళి కుదిరినట్లు ఇంటినుంచి ఉత్తరం వచ్చిందని. వాళ్ళన్నయ్య పెళ్ళి, అక్కయ్య పెళ్ళి ఒకేసారి చేసేస్తారుట.

పెళ్ళికి వారం రోజుల ముందు సెలవు పెట్టి వాళ్ళ వూరు వెళ్ళిపోయాడు సుబ్బారావు. పెళ్ళికి నన్ను తప్పకుండా రమ్మనమని చెప్పాడు.

శెలవు దొరకటం వల్ల పెళ్ళి రోజు వెళ్ళాను సుబ్బారావు వూరు అమలాపురం. రెండు పెళ్ళిళ్ళు బాగానే జరిగాయి.

సుబ్బారావు పెళ్ళిలో వచ్చిన ఒక అమ్మాయితో మాట్లాడుతూండటం గమనించాను నాలుగయిదుసార్లు.

'ఆ అమ్మాయి చాలా బావుంది కదూ? నాకు నచ్చింది' చూపించాడు ఆ అమ్మాయిని, నేను రాబోయే రోజు.

'పేరేమిటి?' అడిగాను.

'బాల' చెప్పాడు.

'మీ బంధువులా?'

'కాదు మా వదిన స్నేహితురాలి బంధువుట.'

ఇద్దరం కలిసి తిరిగి హైదరాబాదు వచ్చేసాము. స్టేషన్‌లో రైలు దిగగానే, 'నా సూట్‌కేస్ కూడా తీసుకు వెళ్ళు గదికి' అన్నాడు.

'ఎక్కడికి వెళతావు నువ్వు?' అడిగాను.

'జయ.' చెప్పాడు.

'నీ పెళ్ళి అయిన తరువాత కూడా జయని వదలవా?'

'చూద్దాం. అయినా అప్పుడు డబ్బు సరిపడాలి కదా.'

సామాను ఆటోలో వేసుకుని ఒక్కడినే వచ్చేశాను గదికి. రాత్రి పదిన్నరకి వచ్చాడు సుబ్బారావు.

నాలుగు నెలలతర్వాత మళ్ళీ శెలవు పెట్టి వెళ్ళాడు సుబ్బారావు అమలాపురం, పెళ్ళికూతుర్ని చూడటానికి.

'గుడ్‌లక్ చెప్పు. నాకు పెళ్ళి కావాలని కోరే వాళ్ళలో నువ్వే మొదటివాడివి' అన్నాడు నవ్వుతూ.

'గుడ్‌లక్ చెబితే లాభం లేదు. ఆ పెళ్ళికూతురు తండ్రికి నువ్వు కోరుకునే కట్నం ఇచ్చే స్తోమత వుండాలని ప్రార్థిస్తాను దేముణ్ణి' అన్నాను.

'కట్నం అంటే దేనికి అంత చేదు నీకు? డబ్బు వస్తుంటే దేనికి వద్దనటం? జీవితంలో పెళ్ళి ఒకసారే. కట్నం కూడా ఒకసారే. వీలయినంత ఎక్కువ రాబట్టుకోవాలి. డబ్బు విలువ తెలియదు నీకు. అసలు నీకు ఆఫీసు, టేబిల్ టెన్నిస్, నువ్వుంటున్న గది తప్ప మరేమీ తెలియవు ప్రపంచంలో. డబ్బు వచ్చినా ఏం చెయ్యాలో తెలియదు. ఓ పది టేబిల్ టెన్నిస్ బాల్స్, ఇరవై బేట్స్ కొంటావు. అంతే' అన్నాడు నవ్వుతూ.

'కట్నం తక్కువయినా ఫర్వాలేదు కొంచెం. అమ్మాయి నచ్చితే ఒప్పేసుకోండి'

'జయ లాంటి అమ్మాయితో ఓ రాత్రి గడిపితే ఇక నువ్వు సాయంత్రం టేబిల్ టెన్నిస్ జోలికి ఛస్తే వెళ్ళవు.'

రెండురోజులు వుండి తిరిగి వచ్చాడు సుబ్బారావు.

'ఏమయింది?' అడిగాను.

'గ్రాండ్ సక్సెస్.' అన్నాడు నవ్వుతూ.

'ముహూర్తం పెట్టేసారా?' అడిగాను సంతోషంగా.

'ఇంకా లేదు చూస్తున్నారు. బహుశ వచ్చేనెల పదిహేడోతారీకుకి నిశ్చయం అవుతుందనుకుంటాను.'

'ఫోటో తీసుకు వచ్చావా?'

'లేదు. అప్పుడు అక్కయ్య పెళ్ళిలో ఆ అమ్మాయిని చూపించానుగా నీక'

'ఆ అమ్మాయేనా? బాల కదా పేరు.'

'అవును చాలా బావుంటుంది. బాగా కల్చర్డ్.'

'జయ కన్నా బాగుందా?'

'జయ కన్నా బాగుంది'

'కట్నం ఎంత?'

'ఎనిమిది వేలు.'

'అంతకి తక్కువ వుండదని అనుకున్నాను.'

'నాలుగువేలు మాత్రమే ఒప్పుకున్నారు వాళ్ళు'

'మిగతా నాలుగువేలు?'

'ఆ అమ్మాయి అక్కయ్య ఇస్తుందట. వాళ్ళింట్లో వాళ్ళకి తెలియకుండా మధ్యవర్తి చెప్పాడు. చెల్లెలికి పెళ్ళయితే వాళ్ళని

చూస్తుందనుకొంటాను.'

'ఈ ఏర్పాటు గురించి తెలుసా మీ నాన్నగారికి?'

'తెలుసు. వాళ్ళింట్లో ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డాము ముందరే. వాళ్ళ అక్కయ్య పేరు లక్ష్మి. హైదరాబాద్ లోనే ఎక్కడో వుద్యోగం చేస్తోందిట.'

'కంగ్రాచ్యులేషన్స్. ఇంక జయని వదిలి పెట్టేస్తావా?'

'జయకి చెప్పకు నా పెళ్ళి కుదిరిన సంగతి. ఒకేసారి వెడ్డింగ్ కార్డ్ ఇస్తాను పెళ్ళి కుదిరినట్లు. ఇప్పుడే తెలిసిపోతే దగ్గరకు రానివ్వక పోవచ్చు.'

'పెళ్ళి నిశ్చయమైనా ఇంకా జయ దగ్గరకు వెళతావా ?'

'ఎందుకు వెళ్ళకూడదు ? కోరిక లేకపోతే మనిషికాదు'

నవ్వుకున్నాను.

• • •

పెళ్ళికి పదిరోజుల ముందరే శెలవు పెట్టి వెళ్ళాడు సుబ్బారావు. శెలవు అయిపోయింది. జీతంరాదు శెలవపెడితే. అయినా శెలవపెట్టి వెళ్ళాడు ముందరే. సుబ్బారావు వెళ్ళగానే, సుబ్బారావుకి కాబోయే భార్యఅక్క లక్ష్మి నాలుగువేలు తీసుకు వచ్చి ఇస్తుందని చెప్పాడు. పెళ్ళికి నేను రాకపోతే వూరుకోననీ, రూమ్ మార్చేస్తానని బెదిరించాడు. తప్పకుండా వస్తానని మాట ఇచ్చాను.

వెళ్ళిన మూడోరోజే తిరిగి వచ్చాడు సుబ్బారావు. రిక్షా దిగివస్తున్న సుబ్బారావునిచూసి తెల్లబోయాను.

'వచ్చేసావే? ఏమయినా మర్చిపోయ్యావా?' అడిగాను, రిక్షావాడికి చిల్లర ఇచ్చి పంపించేశాక.

'శెలవ కేన్సిల్ చేసుకున్నాను. మళ్ళీ జాయిన్ అవుతున్నాను' అన్నాడు సీరియస్‌గా.

'అదేమిటి? పెళ్ళికి వెళ్ళవా?' అడిగాను ఆశ్చర్యంగా.

'పెళ్ళి కేన్సిల్ అయింది'

'ఎందుకు అన్నీ కుదిరిరాయిగా.'

'సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చాక చెప్తాను.' అని బట్టలు మార్చుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

నేను ఆఫీసునుంచి గదికే వచ్చాను తిన్నగా. నాకోసం ఎదురు చూస్తున్నాడు సుబ్బారావు.

'చెప్పు. ఏమయింది, కట్నం ఇవ్వలేదా?' అడిగాను స్టూల్ మీద కూర్చుంటూ.

'ఇవ్వడానికి వచ్చింది వాళ్ళ అక్క.'

'పూర్తి కట్నం తీసుకురాలేదా?'

'పూర్తిగానే తీసుకుని వచ్చింది' అన్నాడు సుబ్బారావు కోపంగా.

'ఏమయింది? వివరంగా చెప్పు' అన్నాను వినుగ్గా.

'బాల అక్కయ్య ఎవరో తెలుసా?' అడిగాడు సీరియస్‌గా నావంక చూస్తూ.

'లక్ష్మి అని చెప్పావ్'

'జయ'

'మళ్ళీ చెప్పు. ఎవరు?'

'జయ. విజయలక్ష్మి.'

'నిజంగా?' తల తిరిగినట్లయింది నాకు.

'అవును. నన్నుచూసి నిర్ఘాంతపోయింది. నాన్నగారితో చెప్పేసాను వెంటనే, డబ్బు తీసుకోవద్దని. కారణం కూడా చెప్పేసాను.'

'...అంటే జయకీ, నీకూ వున్న సంబంధం?'

'మరీ అంత సూటిగా చెప్పలేదు. నాన్నగారు అర్థం చేసుకున్నారు. ఇలాంటి సంబంధం మాకక్కర్లేదు అని చెప్పేసారు జయతో.'

నేనేమీ మాట్లాడలేకపోయాను.

'జయ ఎలాంటిదో తెలుసు గదా నీకు. బాల మాత్రం తక్కువ తినివుంటుందా?'

'తన చెల్లెలికీ, నీకు పెళ్ళి కుదిరినట్లు తెలుసా జయకి?' అడిగాను.

'తనకి ఏమాత్రం తెలియదంటుంది' అన్నాడు సుబ్బారావు.

'తెలుసుంటే ఏం చేసేదిట?'

'ఏమో! తన సంగతి ఇంట్లో ఎవరికీ చెప్పొద్దని కాళ్ళా వేళ్ళా పడ్డది. తన చెల్లెలు పరమ పవిత్రురాలట. వాళ్ళకి తనుచేసే పాపం గురించి ఏమీ తెలియదుట. ఏడిచింది'

'పెళ్ళి మానుకున్నట్లు తెలియచేసారా వాళ్ళకి?'

'ఇంకా లేదు. ఇక్కడ నుంచి వుత్తరం రాసేస్తాను. లేదా నాన్నగారిని వెళ్ళి చెప్పమంటాను.'


'చాలా ఆశ్చర్యం. కుదరక, కుదరక బాలకి పెళ్ళి నీతోనే కుదరాలా. పాపం.' నిట్టూర్చాను.

'నాతో కుదిరితే ఏం? నేనేం రాక్షసుణ్ణా?'

ఎగిరిపడ్డాడు సుబ్బారావు నామీద.

తలుపు చప్పుడయింది. లేచివెళ్ళి తలుపు తెరిచాను. జయ!

ఎదురుగా నుంచుని వుంది. కళ్ళు వాచి



వున్నాయి. ఏడ్చినట్లుగా శోకదేవతలా వుంది.

'రండి' అన్నాను పక్కకి జరిగి.

'మళ్లీ వచ్చావే ఇక్కడికి. గెటవుట్' అరిచాడు సుబ్బారావు లేచి నిలబడి, పిడికిలి బిగించి.

'నేను చెప్పేది నూటికి నూరుపాళ్ళు నిజం. నామాట నమ్మండి. బాలకి నా సంగతి ఏమాత్రం తెలియదు. నలాగా మలినం కాలేదు. స్వచ్ఛమయింది.'

'ప్లీజ్ గెటవుట్.'

'కూర్చోండి మీరు' అన్నాను అనునయంగా, జయతో. కుర్చీలో కూర్చుంది జయ. ఏడుస్తోంది వెక్కి, వెక్కి.

'ఏడవకండి' అన్నాను ఓదార్పుగా.

'నేను చెప్పేది నిజంగా నిజం. నాన్న చచ్చిపోయినతర్వాత వుద్యోగంలో చేరాల్సి వచ్చింది నేను. అన్నయ్యకి పక్షవాతం వచ్చాక పూర్తిగా కుటుంబభారం నామీదే పడ్డది. నా జీతం కుటుంబానికే సరిగా సరిపోయేది కాదు. చెల్లెళ్ళకి ఎలాగయినా పెళ్లిళ్ళు చేయాలి అని వుంది నాకు. కట్నం ఇచ్చేందుకు డబ్బులేదు. అందుకని వాళ్లకి తెలియకుండా ఈవిధంగా డబ్బు సంపాదించసాగాను, పెళ్లిళ్ళకి. ఆ డబ్బులో ఒక్క రాగిపైసకూడా నేను ముట్టుకోలేదు. కట్నంకోసం దాచాను. నేను సంపాదించిందీ, సంపాదించేది నా సుఖంకోసం కాదు. నా చెల్లెళ్ళ సుఖంకోసం' చెప్పింది విజయలక్ష్మి వెక్కివెక్కి ఏడుస్తూ.

'నాలుగువేలు చాటుగా ఇచ్చినా, మరో నాలుగువేలు ఎలా వచ్చాయని చెప్పావు ఇంట్లో?' అడిగాడు సుబ్బారావు.


'ప్రావిడెంట్‌ఫండ్‌లో అప్పుచేసి తీసుకున్నానని చెప్పాను. దయచేసి నా సంగతి వాళ్ళకి చెప్పకండి. గుండెపగిలి ఛస్తాడు అన్నయ్యకి తెలిస్తే.'

'మీ అన్నయ్యకి కూడా తెలిసే వుండాలి. అంతా కలిసే ఈ నాటకం ఆడి నన్ను బాలకి కట్టాలని చూసారు. దేముడి దయవల్ల మీరనుకున్నదంతా జరగలేదు' అరిచాడు సుబ్బారావు.

'బాలని పెళ్ళిచేసుకోకపోయినా ఫర్వాలేదు. జయ సంగతి చెప్పక వాళ్లింట్లో. వాళ్ళకి తెలిసినా, తెలియకపోయినా జయ వద్దని బ్రతిమాలుతోంది కాబట్టి చెప్పక' అన్నాను సుబ్బారావుతో.

'ఎందుకు చెప్పను. తప్పకుండా


పాత తరహా వైద్యాలెందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' బాధను ఎంతో త్వరగా తగ్గించేటప్పుడు.





ఆయింట్‌మెంటులు, పూతలు, మామూలు బిళ్లలూ—ఇవన్నీ పాత తరహావి. అవి పని చెయ్యటానికి ఎంతో కాలం తీసుకుంటాయి. అంతకాలమూ మీరు బాధను అనుభవించాల్సివస్తుంది. ఏమాత్రం తలనొప్పి గాని, ఇతర నొప్పులు గాని కనిపించగానే మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' తీసుకుంటాను. అంతే! నొప్పి చిటికెలో తగ్గిపోతుంది.

నొప్పిని తగ్గించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' శాస్త్రీయమైన ఆధునిక నివారణ. మైక్రోఫైన్డ్ అంటే ప్రతి 'ఆస్ప్రో' బిళ్ల 150 మిలియన్ల అతి సూక్ష్మమైన అణువులను కలిగి ఉండటం. ఈ అణువులు అతి త్వరగా కరుగుతాయి, ఇముడుతాయి, అంత త్వరగానూ నొప్పిని తగ్గిస్తాయి. మీకు సత్వర నివారణ కలిగించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' మామూలు బిళ్లలకంటె రెట్టింపు త్వరగా పనిచేస్తుంది.

అనవసరంగా బాధను అనుభవించకండి—మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను తీసుకోండి.

మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను—నొప్పి · తలనొప్పి · ఫ్లూ · ఒళ్లనొప్పులు · జలుబు · కీళ్లనొప్పులు · గొంతునొప్పి · పంటినొప్పులకి వాడండి.

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్లలు, అవసరమైతే మళ్లీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహాననుసరించి వేసికొనవలెను.




నెమ్మదిగా నివారించును
బిళ్లలోని పెద్ద అణువులు నెమ్మదిగా ఇముడుతాయి. నొప్పి తగ్గటానికి చాలాసేపు పడుతుంది. కనుక అంతసేపూ మీరు బాధ పడాల్సి వస్తుంది.

శీఘ్రముగా నివారించును
బిళ్లలోని చిన్న అణువులు త్వరగా ఇముడుతాయి, బాధామూలమును త్వరగా చేరుకుంటాయి. కనుక త్వరగా నొప్పిని తగ్గిస్తాయి.



నొప్పిని అతిశీఘ్రంగా తొలగించడానికే 'ఆస్ప్రో' మాత్రమే మైక్రోఫైన్డ్ చేయబడినది.

నికోలస్ (N) తయారు

A.G.49 (S) TL

చెప్తాను. నన్ను మోసం చేయాలని చూసారు మీరంతా కలసి' విరుచుకు పడ్డాడు సుబ్బారావు.

'ప్లీజ్. నా సంగతిమాత్రం చెప్పకు. మా ఇంట్లో తెలిసిపోతే నేను బ్రతకలేను.'

జయ ఏడుపు హృదయవిదారకంగా వుంది. ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా కనపడే జయని ఏడుస్తూంటే చూడలేకపోయాను.

'ఏదో కారణం చెప్పి, బాలని పెళ్ళి చేసుకోవటం లేదని. జయ ఇంటికి పెద్దగా తన బాధ్యతలు తెలుసుకుని. వాటిని స్వీకరించి, తను బలియిపోయినా, చెల్లెళ్ళకి న్యాయం చేయాలని అనుకుంది. తనుచేసే చెడ్డపని కూడా మంచికోసరమే చేసింది కాబట్టి తప్పు లేదనుకుంటాను. జయ సంగతి వూరంతా చాటింపువెయ్యకు' అన్నాను సుబ్బారావుతో.

'దయచేసి నువ్వు కలగచేసుకోకు ఈ విషయంలో. దూరంగా వుండటమే మంచిది' అన్నాడు చిరాగ్గా.

'మీ ఇద్దరి సంగతి నాకు మొదటి నుంచి తెలుసు కాబట్టి తప్పకుండా కలిపించుకుంటాను. జయ కోరేది ఒక్కటే. తన సంగతి వాళ్ళింట్లో వాళ్ళకి తెలియనివ్వద్దంటుంది' అన్నాను తీవ్రంగా.

'బాల పెళ్ళికోసమే నేనీ పాడుపని చేసాను. ఏ పెళ్ళికోసమయితే నేను కష్టపడ్డానో ఆ పెళ్ళి నా కారణంగా చెడిపోయిందని — ముఖ్యంగా ఇలాంటి అసహ్యకరమయిన కారణంవల్ల — తెలిస్తే ఇక నేను మావాళ్ళకి నా ముఖం చూపించలేను' అన్నది జయ కళ్ళు తుడుచుకుని.

'బాల చాలా బాగుంటుంది. పెళ్ళి చేసుకోవాలని ఎంతో వుబలాట పడ్డాను. నీవు తెచ్చిన కట్నం డబ్బులో చాలా భాగం నేనిచ్చిందే వుండివుంటుంది. మిగతాది బాల సంపాదించి వుంటుంది వాటాటివాళ్ళదగ్గర. ఛీ ఛీ.'

'దేముడి మీద, నా ప్రాణంమీద ప్రమాణంచేసి చెపుతున్నాను. బాల అలాంటిది కాదు. నాలాగా చెడిపోలేదు. అప్పుడే పుట్టిన పాపాయిలాగా స్వచ్ఛమయింది.'

మళ్ళీ వెక్కి వెక్కి ఏడవసాగింది జయ.

'నన్ను నమ్మించలేవు, నీ ప్రమాణాలతో, ఏడుపులతో. నేను ఖచ్చితంగా వెళ్ళి మీ ఇంట్లో అందరికీ నీ విషయం చెప్తాను. లేకపోతే నిజం తెలియదు నాకు,' అన్నాడు సుబ్బారావు కసిగా.

కళ్ళు తుడుచుకుని లేచి నిలబడింది జయ.

'వెళ్ళివస్తాను' అన్నది.

'త్వరగా వెళ్ళు' కసిరాడు సుబ్బారావు.

ఇన్నాళ్ళు జయని చూడకపోతే బతకలేను అన్న సుబ్బారావుకి ఇప్పుడు జయ చేదయిపోయింది!

'ఎక్కడికి?' అడిగాను జయని.

'ఆరోజు హేవ్‌మోర్‌లో అడిగారు గుర్తుందా, నీ సంగతి మీ ఇంట్లోవాళ్ళకి తెలిసిపోతే ఏం చేస్తావని. అప్పుడే సమాధానం చెప్పాను.'

జయ—చెప్పిన సమాధానం గుర్తుంది నాకు.

'నా సంగతి తెలిసిపోతే ఏం చేయాలో ముందరే ఆలోచించి పెట్టుకున్నాను.'

విజయలక్ష్మి వెళ్ళిపోయింది.

* * *

మూడు సంవత్సరాల తర్వాత తిరుపతిలో, క్యూలో కలిసాడు సుబ్బారావు, అనుకోకుండా.

'పాప ప్రక్షాళన చేసుకోడానికి వచ్చావా?' అడిగాను గుర్తుపట్టి, నవ్వుతూ.

'అసలు నేను పాపం చేస్తేగా, ప్రక్షాళనకి' అన్నాడు.

'ఎందుకు నాతోకూడా చెప్పకుండా జయ మన రూమ్‌కి వచ్చిన మర్నాడు, రిజైన్ ఇచ్చి వెళ్ళిపోయావు?'

'మీ కెవ్వరికీ తెలియడం ఇష్టంలేక.'

'జయ అన్నయ్యతో జయ సంగతి చెప్పావు కదా?'

'ఆహా! ఆ కోపంలో వెళ్ళి అంతా చెప్పాను.'

'అలా చేయటంవల్ల నీకు ఒరిగిందేమిటి?'

'దేముణ్ణి అడుగు. మనిషికి కోరికే కాదు పెట్టింది. కసికూడా పెట్టాడు దేముడు.'

'పెళ్ళయిందా?'

'కాలేదు.'

'ఎక్కడ వుండటం'

'ఓ పల్లెటూరులో. జీతం ఎక్కువే ఇదివరకటికన్నా' నవ్వాడు.

'ఇంకా వెళుతున్నావా?'

'ఎక్కడికి?'

'జయలాంటి వాళ్ళ దగ్గరికి'

'ఎక్కడ వుంది జయ, అడుగుదామనుకుంటున్నాను' క్యూరియస్‌గా చూసాడు.

'దేనికి?'

'వూరికినే. కలుసుకుందామని'

'తెలుసు'

'ఎక్కడ వుంది'

'దేముడి దగ్గర'

'తిరుపతి వచ్చిందా? మనకన్నా ముందరే లోపలికి వెళ్ళగలిగిందా?' అడిగాడు.

'తిరుపతి రాలేదు' చెప్పాను.

'మరి? దేముడి దగ్గరికి అంటే?'

'చచ్చిపోయింది'

'అవునా?' అడిగాడు అనుమానంగా. ముఖంలో విచారం.

'అవును. ఆత్మహత్య చేసుకుంది. నువ్వు వాళ్ళింట్లో అంతా చెప్పావని తెలియగానే'

'పాపం. ఇప్పుడు బ్రతికివుంటే పెళ్ళి చేసుకునేవాణ్ణి. సచ్ ఏ స్వీట్ గర్ల్. చాలా అమాయకురాలు' మాట్లాడలేదు నేను.

'బాల?' అడిగాడు అకస్మాత్తుగా.

'పెళ్ళయింది'

'ఎవరితో'

'జయసంగతి, బాలసంగతి, నీసంగతి తెలిసినవాడితో'

'నువ్వు చేసుకున్నావా?' అడిగాడు.

'ఏం? చేసుకోకూడదా? బాల జయ లాంటిదికాదు ...' మౌనంగా వుండిపోయాడు, సమాధానం చెప్పకుండా.

సుబ్బారావు ముఖం వివర్ణమయింది.

క్యూ ముందుకు కదిలింది. ముందుకు నడిచాడు సుబ్బారావు. వెనక నడిచాను నేను.

క్యూలో నా వెనకాల పది నెలల పాపని ఎత్తుకుని నిలబడ్డ బాలని చూడలేదు సుబ్బారావు.

'సుబ్బారావేనా?' అడిగింది బాల నన్ను.

'అవును. వాడో పాము. మీ అక్కయ్య జయ ఆ పాముకి స్త్రీ సుఖం అనే పాలు పోసింది. రెండున్నరసంవత్సరాల పైనే ఆ పాలుకి అలవాటు పడ్డాడు. చివరకి, పాపం, తనకి పాలుపోసిన జయనే కాటేసాడు' అన్నాను.

నా మాటలు విన్న సుబ్బారావు తల వంచుకోవడం గమనించాడు.